సాక్షి
జగిత్యాల
గురువారం । 17 । జూలై । 2025



మడేలేశ్వరుడికి బోనాలు

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో రజకసంఘం ఆధ్వర్యంలో బుధవారం మడేలేశ్వరస్వామికి బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వరస్వామికి పల్లకి సేవ

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. అడవిలో గుట్టపై ఉన్న స్వామిని ఆషాఢంలో గ్రామంలోకి తీసుకురావడం ఆనవాయితీ. అర్చకులు సీతారామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

పోచమ్మకు బోనాలు



బోనంతో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో మేరు సంఘం మహిళలు బుధవారం పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. శోభాయాత్రలో పోతురాజుల విన్యాసాలు, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేరు సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు కుక్కలు



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని 19, 24, 26వార్డుల్లో బుధవారం యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టుకున్నారు. సుమారు 20కుక్కలకు ఏడో వార్డులో ఉన్న యానిమిల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. అక్కడి వాటికి శస్త్ర చికిత్స చేయించి తిరిగి వదిలిపెడుతామని ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు తెలిపారు. కుక్కల నియంత్రణలో భాగంగా నెలరోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పండ్ల తోటలపై ఆసక్తి పెంచుకోవాలి



మొక్కలు నాటుతున్న డీఆర్డీవో

ధర్మపురి: రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలపై ఆసక్తి పెంచుకోవాలని డీఆర్డీవో రఘునందన్ అన్నారు. మండలంలోని జైన, మగ్గిడి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. రెవెన్యూ, కమ్యూనిటీ ప్లాంటేషన్లను పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను ఎంచుకోవాలన్నారు. వడ్డీలేని రుణాలపై అవగాహన కల్పించాలని, మహిళాసంఘాల సభ్యులు వాటిని వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఎంపీడీవో రవీందర్, ఏపీవో సుజన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

222 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించాలన్న ఉద్దేశంతో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మొత్తం 222 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండి ఉపాధ్యాయులు లేని చోట కొత్తవారిని నియమించామని డీఈవో రాము తెలిపారు. కొంతమంది పోస్టింగ్ ఉన్న చోటే ఉంటామని, తాము వెళ్లలేమని చెప్పినట్లు తెలిసింది. అనారోగ్య కారణాలతో కొందరు సర్దుబాటును వ్యతిరేకిస్తున్నారని సమాచారం.

27న జగిత్యాలకు మంద కృష్ణ

జగిత్యాలటౌన్: ఆసరా పింఛన్లు పెంచాలనే డిమాండ్‌తో ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వికలాంగుల మహాగర్జన సభను విజయవంతం చేసే లక్ష్యంతో ఈనెల 27న జిల్లా కేంద్రంలో సన్నాహక సదస్సు ఉంటుందని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరు కానున్నారని జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని వికలాంగులను కలిసి ఆహ్వానించారు.






ప్రమాదమని తెలిసినా..

జగిత్యాల: అధికారులకు పట్టింపులేకపోవడం, స్కూల్ యాజమాన్యాలు శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు ఆటోలు, వ్యాన్లలో ప్రమాదకర స్థితిలో స్కూళ్లకు వెళ్తున్నారు. ఆటోలు, వ్యాన్ల డ్రైవర్లు కొందరు సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. జిల్లాకేంద్రంలో ఈ పరిస్థితి విపరీతంగా ఉంది. ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో అధికారులకే తెలియాలి. పైగా కొన్ని ఆటోలు, వ్యాన్లు కాలం చెల్లినవి కావడంతో పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంలో అధికారులతోపాటు తల్లిదండ్రులు కూడా పిల్లల భద్రతపై స్పందించాల్సిన అవసరం ఉంది.

పల్లెవైద్యం.. ఆరోగ్యం భద్రం

- ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు
- ఎంబీబీఎస్, బీఏఎంఎస్, నర్సింగ్ వైద్యులు
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ
- సేవలపై సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



యువతి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైద్యురాలు

మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఉచితంగా సేవలు అందుతుండడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఒక్కో కేంద్రానికి ప్రతిరోజు సగటున 25 నుంచి 40 మందికి పైగా ప్రజలు వస్తున్నారు. ఈ కేంద్రాలతో దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పాయని, ఆర్థిక భారం తగ్గిందని గ్రామీణులు చెబుతున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు.. 106 రకాల మందులు

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పలు రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారు. మెట్‌పల్లి మండలంలో 23 గ్రామాలు ఉన్నాయి. ఇందులో వేంపేట, వెల్లుల, మెట్లచిట్టాపూర్, కొండ్రికర్ల, ఆత్మకూర్ గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు వైద్య సేవల కోసం చుట్టుపక్క గ్రామ ప్రజలు కూడా వస్తున్నారు. రక్తం, మూత్ర పరీక్షలతోపాటు మరో 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.ర్యాపిడ్ కిట్ల ద్వారా అక్కడే పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఫలితాన్ని వెంటనే చెబుతున్నారు. నిర్ధారణ అయిన రోగానికి చికిత్స అందిస్తూ.. 106 రకాల మందులు ఇస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూసుకుంటున్నారు. గతంలో ఈ ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు మాత్రమే ఉండేవారు. 2022–23 ఈ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసి వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు వైద్యులను నియమించింది. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, నర్సింగ్ ఆఫీసర్లను కేంద్రాలకు పంపించింది. ప్రస్తుతం వారంతా కేంద్రాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎన్‌క్వాస్ గుర్తింపు

గతంలో మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల గుర్తింపు (నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ –ఎన్‌క్వాస్) వరించింది. వైద్య సేవలు, పరిశుభ్రత, పచ్చదనం, రోగుల సంతృప్తి స్థాయి, ఆసుపత్రికి వచ్చే వారి పట్ల సిబ్బంది మెలిగే తీరు, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై కేంద్ర బృందం ఆరా తీసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా 84 శాతం గ్రేడ్ పాయింట్ల చోటు కల్పించింది.

సొంత భవనాలు పూర్తయితే మేలు..

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు పలుచోట్ల సొంత భవనాలు లేక ఇతర భవనాల్లో నిర్వహిస్తున్నారు. నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. పనుల్లో జాప్యం జరుగుతోంది. కొత్త భవన నిర్మాణాలు పూర్తయితే మరిన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు వైద్య సేవలను పెంచవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



ఆరోగ్యం బాగాలేనప్పుడు ఊరిలోని దవాఖానాకు వస్తా. ఇక్కడ పరీక్షలు చేసి అందుకు తగిన మందులు ఉచితంగా ఇస్తున్నారు. వైద్య సేవలు బాగున్నాయి. మా ఊళ్లోని చాలా మంది కూడా ఇక్కడికే వచ్చి డాక్టర్‌కు చూయించుకుంటున్నారు.

– లక్ష్మీనారాయణ, మెట్లచిట్టాపూర్

మంచి వైద్యం అందిస్తున్నాం



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మెరుగ్గా అందిస్తున్నాం. అనారోగ్య సమస్యలు ఉన్న వారు చాలా మంది కేంద్రాలకు వస్తున్నారు. వారికి కావాల్సిన చికిత్స చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నాం.

– ఎలాల అంజిత్‌రెడ్డి, వైద్యాధికారి

సీఎంఆర్ అప్పగింతలో జాప్యం

- మిల్లర్ల వద్ద 25,448 టన్నుల ధాన్యం
- బియ్యం అప్పగింతకు ఈనెల 27 చివరి తేదీ



జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించి. తిరిగి మిల్లర్ల నుంచి సీఎంఆర్ రూపంలో సేకరిస్తుంది. బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగిస్తుంది. అయితే జిల్లాలో మిల్లర్లు ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని మాత్రం తిరిగి అప్పగించలేదు. జాప్యం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం వెనుకడుగువేస్తోంది. బియ్యం అప్పగించకుండా జాప్యం చేస్తున్న మిల్లులకు ఇటీవల సివిల్ సప్లై అధికారులు ధాన్యం కేటాయించలేదు. అయితే రాజకీయ ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయించుకున్నారు. జిల్లాలో ప్రభుత్వానికి ఈనెల 27 వరకు 28 మంది రైస్‌మిల్లర్లు 25,448 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. ఇప్పటి వరకు 55 మంది రైస్‌మిల్లర్లు 100 శాతం బియ్యాన్ని అప్పగించారు.

2023–24కు ధాన్యం కేటాయింపు

జిల్లాలో 2023–24కు గాను యాసంగిలో ప్రభుత్వం 4,05,477 టన్నుల ధాన్యం సేకరించింది. దానిని 23 మంది రైస్‌మిల్లర్లకు కేటాయించగా ఇప్పటివరకు 2,75,349 టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా.. 2,49,901 టన్నులు అప్పగించారు. ఇప్పటివరకు 55 మంది రైస్‌మిల్లర్లు 100 శాతం బియ్యాన్ని అప్పగించగా.. 28మంది రైస్‌మిల్లర్లు 25,448 టన్నుల బియ్యాన్ని అప్పగించాల్సి ఉంది. ఈనెల 27 వరకు అప్పగించకపోతే డిఫాల్టర్లుగా ప్రకటించే అవకాశం ఉంది. డిఫాల్టర్లుగా తేలిన మిల్లర్లకు వచ్చే సీజన్‌లో ధాన్యం కేటాయించరు.

బియ్యం అప్పగించేలా చూస్తున్నాం

– జితేంద్రప్రసాద్, డీఎం

ప్రభుత్వ ఆదేశాల మేరకు 55 మంది రైస్‌మిల్లర్లు వందశాతం బియ్యం అప్పగించారు. మరో 28 మంది ఈనెల 27 వరకు 25,448 టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. కలెక్టర్, అదనపు కలెక్టర్ మిల్లర్లతో సమావేశమై బియ్యం అప్పగించేలా చర్యలు చేపడుతున్నారు.

అసంపూర్తిగా వంతెన పనులు



మైతాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్డు నిర్మాణ పనులు



రామాజీపేట వంతెనపై బురదమయంగా ఉన్న వంతెన నిర్మాణ పనులు

- వాహనదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

రాయికల్: మండలంలోని రామాజీపేట బతుకమ్మ వాగు, మైతాపూర్ గ్రామాల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షకాలంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైతాపూర్ వంతెన నిర్మాణం కోసం రూ.2.91 కోట్లు, రామాజీపేట వంతెన నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. వంతెన నిర్మాణానికి సైడ్‌వాల్స్, బీటీ రోడ్డు నిర్మాణం వంటి పనులను నిలిపివేశారు. చేసిన పనులల్లో సైతం నాణ్యత లోపించడంతో కంకర తేలుతోంది. ఈ వంతెన మీదుగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తరుచూ ప్రయాణం చేస్తున్నా.. పనులపై మాత్రం చొరవ చూపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘ఇందిరమ్మ’ పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



చిట్టాపూర్‌లో ఇందరిమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టాలని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. గడువులోపు నిబంధనల మేరకు పనులు పూర్తి చేసుకునేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. గ్రామపంచాయతీ, హెల్త్ సబ్ సెంటర్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. సాతారం, సిరిపూర్‌లో పర్యటించారు.

‘పది’ ఫలితాల్లో జిల్లా ముందుండాలి

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటిస్థానంలో నిలిపేలా విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సాతారం పాఠశాలలో విద్యాబోధన, డిజిటల్ తరగతులపై అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీష్ పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శనం



పొలంబాటలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శనం

కథలాపూర్: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శనం అన్నారు. మండలకేంద్రంలో ట్రాన్స్‌కో అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటార్ల వద్ద ఇనుపడబ్బాలు కాకుండా ఫైబర్‌వి బిగించుకోవాలన్నారు. ఇనుప డబ్బాలతో విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదముందన్నారు. సిరికొండ శివారులో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ గంగారాం, మెట్‌పల్లి డీఈ మధుసూదన్, ఏడీఈ రఘుపతి, ఏఈలు దివాకర్‌రావు, భూమేశ్వర్, సబ్ ఇంజినీర్ నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు తగ్గించాలి

కోరుట్ల రూరల్: విద్యుత్ ప్రమాదాల నివారించి.. మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్‌ఈ అన్నారు. పట్టణంలో కోరుట్ల, మేడిపెల్లి, కథలా పూర్ మండలాల విద్యుత్ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బీసీల ఆర్డినెన్స్ ఎన్నికల స్టంటే..



మాట్లాడుతున్న దావ వసంత, నాయకులు

జగిత్యాల: బీసీల ఆర్డినెన్స్ కేవలం స్థానిక ఎన్నికల స్టంట్ మాత్రమేనని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీసీల పక్షాన నిలిచి న్యాయం చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. అన్ని కులాల వృత్తులకు ఊతమిచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. గంగపుత్రులు, రజక, నాయీబ్రాహ్మణులనూ మోసం చేస్తోందన్నారు. నాయకులు గంగాధర్, మల్లేశం, ప్రవీణ్‌గౌడ్, శంకర్, రాజన్న, మల్లారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు అండగా కాంగ్రెస్



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలటౌన్: సామాజికంగా వెనుకబాటుకు గురవుతున్న వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, అందులో భాగంగానే బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపి వంద రోజులు దాటిందని గుర్తు చేశారు. కేంద్రం తాత్సారం చేస్తుండటంతో ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంలోని తమ ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలన్నారు. ఏ బిల్లుపైనైనా మూడు నెలల్లో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుంటే అది అమలు అయినట్టేనన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేశారు. నాయకులు బండ శంకర్, గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, ధర రమేష్, పిప్పరి అనిత, ముంజాల రఘువీర్, గుండ మధు, లైశెట్టి విజయ్, నేహాల్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీమంత్రి

- మంజూరు పత్రాల పంపిణీలో గందరగోళం



లక్ష్మీపూర్‌లో మంజూరుపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం నామమాత్రంగా పట్టాల పంపిణీ చేపట్టారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల్లో ఒక్కో గ్రామానికి ఆరుగురు సభ్యులను నియమించారు. ఇదులో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వర్గంలో ముగ్గురు, మాజీమంత్రి జీవన్‌రెడ్డి వర్గంలో ముగ్గురికి కమిటీలో చోటు కల్పించారు. అయితే బుధవారం పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో అధికారులు ఎమ్మెల్యే నియమించిన కమిటీ సభ్యులకు మాత్రమే సమాచారం అందించారు. కార్యక్రమానికి 10 నిమిషాల ముందు జీవన్‌రెడ్డి వర్గ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారంతా ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోతె గ్రామంలో ఎమ్మెల్యే నియమించిన కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారికి మంజూరు పత్రాలు రాగా.. మాజీమంత్రి జీవన్‌రెడ్డి నియమించిన కమిటీ సభ్యులు సూచించిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు రాకపోవడంపై కూడా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులపై కమిటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి రెండు రోజుల్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

కొడుకు చనిపోయాడనే బెంగతో తండ్రి ఆత్మహత్య

ముత్తారం(మంథని): చేతికి అందిన కొడుకు చనిపోయాడనే బెంగతో మారం రాజిరెడ్డి(55) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసార్లగడ్డలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మారం రాజిరెడ్డి వ్యవసాయ కూలీగా పని చేసుకుంటున్నాడు. వచ్చేఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే, ఇతడి కొడుకు రమేశ్‌రెడ్డి గతేడాది పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్నుంచి తీవ్రమనోవేదనతో ఉంటున్నాడు. తన కన్నకొడుకు మృతి చెందడం బాధిస్తోందని తన భార్యకు తరచూ చెప్తూ ఏడ్చేవాడు. ఈక్రమంలో కొడుకు లేడనే ఆవేదనతో ఈనెల 15న రాజిరెడ్డి పురుగుల మందు తాగి ఇంట్లోనే పడుకున్నాడు. కూలీ పనికి వెళ్లి ఇంటికి వచ్చిన భార్య పద్మ నిద్రలేపేందుకు యత్నించగా.. తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. సమీప బంధువులకు సమాచారం అందించిన పద్మ వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అప్పల బాధతో వివాహిత..


గంగలక్ష్మి (ఫైల్)

ధర్మపురి: చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపానికి గురైన ఓ మహిళ నిద్రమాత్రలు మింగగా.. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ధర్మపురికి మెరుగు గంగలక్ష్మికి సిరిసిల్లకు చెందిన సంతోష్‌తో గతంలోనే వివాహమైంది. వీరికి కూతురు సంతానం. గంగలక్ష్మి అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడుతూ.. తెలిసిన వారి వద్ద అప్పు చేసింది. అప్పు ఇచ్చిన వారు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయగా.. మనస్తాపానికి గురైన గంగలక్ష్మి (40) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు ఆమెను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. భర్త సంతోష్ సిరిసిల్లలో సాంచాల పని చేస్తుంటాడని తెల్సింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి


డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయిన బైక్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన గాండ్ల సత్యం (53)అనే సింగరేణి ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. తన కూతురు ముద్దసాని లావణ్యను పెద్దపల్లిలోని కాలేజీలో చేర్పించేందుకు బైక్‌పై వస్తున్నాడు. అప్పన్నపేట శివారులో డివైడర్‌ను అదుపు తప్పి ఢీకొన్నాడు. ఆ తర్వాత డివైడర్ ఆవతల ఉన్న రోడ్డుపైకి పడ్డాడు. ఇంతలోనే అటుగా వేగంగా వస్తున్న లారీ సత్యం పైనుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంట ఉన్న కూతురు డివైడర్‌పై పడగా గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై మల్లేశ్ తన సిబ్బందితో వెళ్లి గాయపడ్డ లావణ్యను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

అజ్ఞాతంలో 16మంది కీలకనేతలు

- పెద్దపల్లిలో 10 మంది, మంచిర్యాలలో ఆరుగురు
- జనజీవన స్రవంతిలోకి వచ్చేవారికి పునరావాసం
- లొంగిపోయేలా నిర్బంధం పెంచుతున్న పోలీసులు

రామగుండం పోలీస్‌కమిషనరేట్‌లో మావోయిస్టులు	
పెద్దపల్లి జిల్లా:	మంచిర్యాల జిల్లా:
10	06

గోదావరిఖని: మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఒకవైపు వేట కొనసాగిస్తూనే మరోవైపు కీలక మావోయిస్టు నేతల లొంగుబాట్లను ప్రోత్సహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు మృతి చెందగా, కొందరు లొంగుబాటు ఎంచుకుంటున్నారు. గత ఏడాదిలో మావోయిస్టు కీలక నేత నంబాల కేశవరావుతో సహా 357మందికిపైగా నక్సల్స్ మృతి చెందారు. అయితే, బూటకపు ఎన్‌కౌంటర్‌లో 80 మంది వరకు చనిపోగా.. మొత్తం మృతుల్లో 136 మంది మహిళా నక్సల్స్ ఉన్నట్లు మావోయిస్టు పార్టీ తన డాక్యుమెంటరీలో వెల్లడించింది. అనారోగ్యంతో నలుగురు, ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపింది.

దండకారణ్యం జల్లెడ..

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నారు. ఆకురాలే కాలంలో మొదలైన ముప్పేట దాడి ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో కీలక నేతలను కాపాడుకోవడం కోసం, పార్టీ ఉనికి చాటుకోవడం కోసం అగ్రనాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వ్యూహం ఏమైనా.. పోలీసులు బలగాలు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రతీసారి నక్సల్స్‌పై పైచేయి సాధిస్తూనే ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు నిర్బంధం పెరగడం, ఇదేసమయంలో వారి సమాచారం బయటకు పొక్కడంతో కీలక కేడర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న చాలా మంది లొంగిపోయేందుకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామగుండం పోలీస్ కమిషనర్ ఎదుట మంగళవారం లొంగిపోయిన మావోయిస్టు దంపతులు ఇదే విషయాన్ని వెల్లడించాడు. దీంతో అనారోగ్యంతో బాధపడే నేతలు జనజీవన స్రవంతిలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారని భావిస్తున్నారు.

కీలకనేతలపై పోలీసుల ఫోకస్..

రామగుండం పోలీసు కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కీలక నేతలపై పోలీసులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. నక్సల్స్ కుటుంబ సభ్యులను కలవడం, బాగోగులు తెలుసుకుని ఆర్థిక సాయం చేయడం తరచూ చేస్తూనే ఉన్నారు. నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసేలా సూచించాలని వారికి చెబుతున్నారు.


మల్లా రాజిరెడ్డి, అప్పాసి నారాయణ, మల్లోజుల వేణుగోపాల్‌రావు, పుల్లూరి ప్రసాద్‌రావు, కంకణాల రాజిరెడ్డి, సలాకుల సరోజ, జాడి వెంకటి, బండి ప్రకాశ్, బబ్బెర రవి

కీలకనేతలు	క్యాడర్	గ్రామం	రివార్డు (రూ.లక్షల్లో)
పెద్దపల్లి జిల్లా:			
మల్లా రాజిరెడ్డి	సీసీఎం సెక్రటరీ	ఎగ్లాస్‌పూర్, మంథని	25
అప్పాసి నారాయణ	డీసీఎం, టెక్నికల్‌టీం	రామగుండం	5
గంకిడి సత్యనారాయణరెడ్డి	ఎస్‌సీఎం	సబ్బితం, పెద్దపల్లి	20
మల్లోజుల వేణుగోపాల్‌రావు	సీసీఎం	పెద్దపల్లి టౌన్	25
ఆలేటి రామలచ్చులు	డీసీఎస్	పాలితం, పెద్దపల్లి	8
దాతు అయిలయ్య	కమాండర్	గోపయ్యపల్లి, పెద్దపల్లి	5
పుల్లూరి ప్రసాదరావు	సీసీఎం, గైడింగ్	వడ్కాపూర్, జూలపల్లి	25
ధీకొండ శంకరయ్య	కమాండర్	వెంకట్రావ్‌పల్లి, జూలపల్లి	5
కంకణాల రాజిరెడ్డి	ఎస్‌సీఎం	కిష్టంపేట్, కాల్వశ్రీరాంపూర్	20
జువ్వాడి వెంకటేశ్వర్‌రావు	ఏసీఎం	కొదురుపాక, సుల్తానాబాద్	4
మంచిర్యాల జిల్లా:			
సలాకుల సరోజ	దండకారణ్య స్పెషల్‌జోన్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	20
ఆరేపల్లి కృష్ణ	ఏసీఎస్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	5
జాడి పుష్ప	డీసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	5
జాడి వెంకటి	ఏసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	20
బండి ప్రకాశ్	సికాస	మందమర్రి	20
బబ్బెర రవి	పార్టీ మెంబర్	మందమర్రి	5

పునరావాసంపైనా దృష్టి

జనజీవన స్రవంతిలో కలిసేవారిపైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టుల నేతలపై ఉన్న రివార్డును వారికే అందజేస్తూ ప్రభుత్వ భూమి, ఇళ్లు, సమాజంలో గౌరవంగా బతికేలా శ్రద్ధ చూపిస్తున్నారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపెల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న, ఆయన భార్య చౌదరి అంకుబాయి మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై ఉన్న రూ.25లక్షల రివార్డును వారికే అందజేశారు.

కలవరపెడుతోన్న అనారోగ్య సమస్యలు

మావోయిస్టు పార్టీలో కీలక నేతలు ఐదుపదుల వయసు దాటిన వారే ఉండడంతో నిర్బంధానికితోడు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా వైద్య సదుపాయం లభించక చాలామంది మావోయిస్టులు ఇతర రాష్ట్రాలకు వలసపోవడం, మరికొందరు చేసేదేమీ లేక లొంగుబాటు వైపు మొగ్గుచపుతున్నారని తెలిసింది.

లొంగిపోతే పునరావాసం



మావోయిస్టులు తుపాకీతో సాధించేదేమీలేదు. జనజీవన స్రవంతిలో కలిసి బ్యాలెట్ పద్ధతిన పోటీ చేయాలి. ప్రజలకు సేవలు అందించాలి. మారుమూల ప్రాంతాల్లో చైతన్యం పెరిగింది. అభివృద్ధిని స్వాగతిస్తున్నారు. నక్సల్స్ పాత కాలం నాటి సిద్ధాంతాలతో సాధించేదేమీ లేదు. లొంగిపోయే మావోయిస్టులకు అన్నివిధాలా సహరిస్తాం.

– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

వాహిని షాపింగ్ మాల్ ప్రారంభం



వివిధ రకాల శారీ డిజైన్లు పరిశీలిస్తున్న అనుపమ పరమేశ్వరన్, షాపింగ్ మాల్ ఎదుట ప్రజల సందడి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని ఉస్మాన్‌పురలో నూతనంగా ఏర్పాటుచేసిన వాహిని షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రముఖ సినీనటి అనుపమ పరమేశ్వరన్, జాజూ శారీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు ఓం ప్రకాశ్‌జీ జాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షాపింగ్‌మాల్‌లో వివిధ రకాల వస్త్రాల డిజైన్లు పరిశీలించి, బాగున్నాయన్నారు. 'హాయ్ కరీంనగర్.. ఎలా ఉన్నారు' అని సినీనటి అనుపమా పరమేశ్వరన్ అభిమానులను పలుకరించారు. షాపింగ్‌మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన కస్టమర్లకు, ప్రజలకు, శ్రేయోభిషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేణుభాయ్ జాజు, కమల్ భాయ్ జాజు, వేముల శ్రీనివాస్, విష్ణు, దేవరాజ్, నాగరాజ్, శ్రీకాంత్, మెండె అనిల్ కుమార్, గడ్డం అభిషేక్, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్‌కుమార్, ప్రశాంత్, దీకొండ రాజు పాల్గొన్నారు.

స్పందిస్తున్న హృదయాలు

- అజయ్‌కి అండగా ఆరోగ్యశాఖ మంత్రి
- మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలింపు

సాక్షి స్పందన

వీణవంక: వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన సుద్దాల అజయ్ వినాయక విగ్రహాల తయారీకేంద్రంలో గాయపడి అచేతనస్థితిలో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతుండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడటంపై 'సాక్షి'లో బుధవారం 'నిరుపేదకు పెద్ద కష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ సంఘటనపై సీఎంవో కార్యాలయం, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయం నుంచి ఆరా తీశారు. అజయ్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి వాకాబు చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. అజయ్‌కి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేయడంతో హుటాహుటిన అజయ్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. దగ్గరుండి నిమ్స్‌కు తరలించారు. కాగా.. పలువురు దాతలు ఇప్పటి వరకు రూ.1.20 లక్షల సాయం అందించారు.

పడిపోయిన సన్నబియ్యం ధరలు

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట



సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో సన్నబియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటను కలిగించినట్లయ్యింది. గతంలో క్వింటాల్ ధర రూ.5,000 నుంచి రూ.6,000 వరకు పలికిన ధర.. ఇప్పుడు రూ.4,500 నుంచి రూ.4,000కు పడిపోయింది.

ధరల తగ్గుదలకు కారణాలు..

రాష్ట్రప్రభుత్వం ఇటీవల సన్నవడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. అంతేగాకుండా, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఫలితంగా ధరలు పడిపోయాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకంతో సన్నవడ్ల సాగు విస్తీర్ణం, దిగుబడి పెరుగుతోంది. ఇది మార్కెట్‌లో సన్న బియ్యం ధరల తగ్గుదలకు దారితీస్తోందంటున్నారు.

రేషన్‌కార్డు లేనివారికి ప్రయోజనం

జిల్లాలో సుమారు 35వేల కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. వీరికి ప్రతి నెలా దాదాపు 10 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమంటున్నారు. ఇప్పుడు ధరలు తగ్గడంతో వీరికి ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు.

సన్నబియ్యం ధరలు(క్వింటాలుకు రూ.లలో)	
రకం	ధర
హెచ్ఎంటీ	5,600 – 4,600
కర్నూల్ మసూరి	4,800 – 4,000
జైశ్రీరామ్	5,800 – 4,600

కాంగ్రెస్ పార్టీకి ఎదురే లేదు

- బీజేపీ, బీఆర్ఎస్ బండారాన్ని ఎండగట్టండి
- పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు నిఖార్సయిన కార్యకర్తలకే
- ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్

కరీంనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి దేశానికి రోల్‌మోడల్‌గా మారుతోందని, రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం డీసీసీ కార్యాలయంలో జరిగిన పార్టీ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సన్నాహాక సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే మెంబర్‌షిప్ విషయంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు. కార్యకర్తలు మొక్కవోని దీక్షతో పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చారని అదే స్ఫూర్తితో లోకల్‌బాడీ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో పెద్దపీట ఉంటుందన్నారు. తెలంగాణ సంపదను దోచుకొని లక్షల కోట్లు లూటీ చేసిన కేసీఆర్‌కు రాష్ట్రంలో స్థానం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రుద్ర సంతోష్, సత్తు మల్లేశం, రహమతు హుస్సేన్, వైద్యుల అంజన్ కుమార్, వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్, వి.నరేందర్‌రెడ్డి, కటకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధాని చేద్దాం

దేశంలో బీజేపీ గ్రాఫ్ తగ్గుతోందని, రాబోయే రోజుల్లో మోదీని గద్దె దించి రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ పాలన గాడి తప్పిందని, 11ఏళ్లుగా ప్రజలను మభ్యపెట్టడం తప్పా బీజేపీ చేసిందేమి లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూసేందుకు ప్రజలు తహతహలాడుతున్నారని అన్నారు.

తిరుపతికి మరో ప్రత్యేక రైలు

- నాందేడ్ వయా కరీంనగర్ మీదుగా
- ఆగస్టు 2 నుంచి ప్రారంభం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి మరో ప్రత్యేక రైలు నడిపించేందుకు దక్షిణమధ్య రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఆగస్టు2 నుంచి 31 వరకు ఈ ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి ఒక రెగ్యులర్ రైలుతోపాటు మరో ప్రత్యేక రైలు నడుస్తోంది. సోమ, గురు, ఆదివారం ఈ రైళ్లు కరీంనగర్ నుంచి తిరుపతికి నడుస్తుండగా కొత్త రైలు ప్రతి శనివారం నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా వెళ్తుంది. ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి కరీంనగర్ మీదుగా నాందేడ్‌కు వెళ్తుంది. ప్రతి శనివారం నాందేడ్‌లో సాయంత్రం 4.50గంటలకు బయల్దేరి ఆదివారం ఉదయం 11.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. అదేరోజు రాత్రి 7.45గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. ప్రత్యేక రైలును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ రైల్వేస్టేషన్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ భానుచందర్ కోరారు.

పదిరలో చిరుత సంచారం

- ఆనవాళ్లు గుర్తించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం రాత్రి చిరుత సంచరించింది. గ్రామానికి చెందిన ఎదునూరి శ్రీనివాస్ పొలంలో చిరుత పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో అటువైపుగా రైతులు రాత్రిపూట వెళ్లవద్దని సెక్షన్ అధికారి సకారాం సూచించారు. మండలంలోని రాగట్లపల్లి, నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్‌లలోనే వారం నుంచి చిరుత సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీశాఖ అధికారులు వెంటనే చిరుతను బంధించాలని రైతులు కోరుతున్నారు.


పదిరలో చిరుత పాదముద్రలు

బనకచర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేదిలేదు

- రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి పెద్దపల్లి: బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబురాల సభ నిర్వహించారు. మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. నీటి వాటా విషయంలో రాజీ లేదన్నారు. గోదావరి జలాల విషయంలో తమ ప్రభుత్వ వైఖరిని సీఎం రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో స్పష్టం చేసినా ఏదోరకంగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనేఉన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ ఉరఫ్ సీతక్క తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఆర్థికతోడ్పాటు అందిస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో బతకాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం అమలు చేసే ప్రతీపథకాన్ని మహిళల పేరు మీదనే అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

స్నేహితుడి మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు


జగిత్యాలజోన్: మద్యం సేవించడమే కాకుండా.. లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాన్ని నడిపి స్నేహితుడి మరణానికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు, రూ.11 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి సుగళి నారాయణ బుధవారం తీర్పు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన యజమానికీ రూ.2 వేల జరిమానా విధించారు. పీపీ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కూనపు పోశన్న వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. 13 జూన్ 2022న పెద్ద కొడుకు సునీల్ తన మిత్రుడైన పల్లికొండ రోహిత్‌తో కలిసి గొడిసెరాల గ్రామానికి వెళ్లారు. అక్కడ మరో మిత్రుడైన జెల్ల ప్రవీణ్‌తో కలిసి విందు చేసుకున్నారు. ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై ధర్మపురి వైపు వెళ్తున్నారు. రాత్రి 8.30 గంటల సమయంలో దోనూర్ శివారు మూలమలుపు వద్ద అదుపు తప్పి ముగ్గురూ కింద పడ్డారు. వెనుక కూర్చున్న అనిల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మద్యం తాగి, అతి వేగంగా, అజాగ్రత్తగా రోహిత్ బైక్ నడపడంతోనే తన కొడుకు మరణించాడంటూ అనిల్ తండ్రి పోశన్న ధర్మపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ బిల్లా కోటేశ్వర్ దర్యాప్తు చేశారు. బైక్ నడిపిన రోహిత్, లైసెన్స్ లేని వ్యక్తికి బైక్ ఇచ్చినందుకు యజమాని పల్లికొండ మల్లేశ్‌పైనా పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, రాజు, శ్రీధర్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో రోహిత్‌కు పదేళ్ల జైలు, రూ.11 వేల జరిమానా, లైసెన్స్ లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన పల్లికొండ మల్లేశ్‌కు రూ.రెండు వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.













సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16101]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824